

మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ



అల్లాహ్ తేరోనాం, ఈశ్వర్ తేరో నాం

సబ్‌కో సన్మతి దే భగవాన్

'హమ్ దోనో ' సినిమాలో ప్రధానంగా రెండు భజనగీతాలున్నాయి. ఒకటి 'అల్లాహ్ తేరో నామ్. రెండవది 'ప్రభు తేరో నామ్' ఈ రెండూ ప్రసిద్ధి పొందిన భజనగీతాలు. ఈ రెండూ రచించింది సాహిర్ లూధియాన్వీ. సంగీత దరర్శకత్వం వహించింది జయదేవ్. ఈ రెండుపాటలు నటి 'నంద' పై చిత్రీకరించారు.

నటి 'నంద', ఆరంభంలో నాయికగా కన్నా సినిమాల్లో 'సోదరి'లా పేరు పొందింది, మన తెలుగులో రోజారమణిలాగా. కానీ పద్ధతి ప్రకారం ఆమె 'సోదరి' ఇమేజిని చెరిపి, నాయిక ఇమేజ్ ని ఏర్పాటు చేసుకుంది. అయితే, ఇతర నాయికల్లా, ఆమె 'గ్లామరస్' నాయిక కాదు. శాంతిగా, మర్యాదగా ఉంటూ, అందరి గౌరవం పొందే నాయిక. అందుకే, 'హమ్ దోనో' సినిమాలో మరో నాయికకు 'అభీ న జావో ఛోడ్‌కర్' అన్న రొమాంటిక్ గీతం ఉంది. 'నంద'కు రెండు భక్తిగీతాలు, అవీ అత్యద్భుతమైన , అత్యంత ప్రజాదరణ పొందిన భక్తిగీతాలున్నాయి. సినిమాలో 'నంద' గృహిణి.

'జయదేవ్' అతి గొప్ప సంగీత దర్శకుడు. అతి మధురమైన గీతాలను ఆయన సృజించాడు. ఆయన పాటలు ప్రజలను మెప్పిస్తాయి కానీ, వ్యాపారపరంగా అంతగా పనికి వచ్చేవికావు. ఆయన పాటలు వర్షపు నీరు, నెమ్మదిగా భూమిలోకి ఇంకినట్టు ప్రేక్షకుల మనస్సుల లోతుల్లో చేరతాయి. అక్కడ నిలిచిపోతాయి. అమితమైన ఆనందాన్నిస్తాయి. మనసును మురిపిస్తాయి. కానీ శరీరాన్ని ఊపేవి కావు. అందుకే అత్యంత ప్రతిభావంతుడయి కూడా ఆయన కొద్ది సినిమాలకే పనిచేశాడు. అతి అద్భుతమైన పాటలను సృజించి కూడా ఎన్నడూ అగ్రశ్రేణి సంగీత దర్శకుడిగా గుర్తింపు పొందలేదు.

'సాహిర్ లూధియాన్వీ' ని అతి గొప్ప గేయరచయితగా అందరూ ఏకగ్రీవంగా అంగీకరిస్తారు. తన ఆదర్శాలను, ఆలోచనలను సినిమా సందర్భ పరిధిలో ఒదిగింప చేస్తూ, పాత్రల వ్యక్తిత్వాలకు తగ్గ రీతిలో పాట రచిస్తూ, ఆ పాటలో

సార్వజనీన భావనలను పొందు పరుస్తాడు. అందువల్ల పాట శ్రోతలను అలరించే పాటలుగానే కాక నిత్యజీవితంలో వారి సంఘర్షణలకు, సమస్యలకు, ఆందోళనలకు పరిష్కారం చూపే పాటలుగా నిలుస్తాయి. ఈ సినిమాలోని రెండు భక్తి గీతాలు 'అల్లా తేరో నామ్', ప్రభు తేరో నామ్' అలాంటి పాటలు.

'అల్లాహ్ తేరో నామ్' పాట బాణీకానీ, పాటలోని భావం కానీ సార్వజనీనమైనది. 'నీ పేరే అల్లా, నువ్వే ఈశ్వరుడవు. అందరికీ సన్మతిని ఇవ్వు భగవంతుడా' అని ప్రార్థిస్తున్నాడు కవి.

'సబ్ కో సన్మతి దే భగవాన్', అందరికీ సద్బుద్ధిని ప్రసాదించమన్న భావనకు ఆధారం, వేదంలో, గాయత్రి మంత్రంలో 'ధియో యోనః ప్రచోదయాత్'లో కనిపిస్తుంది. దివ్యజ్యోతి ప్రసరణ ద్వారా సమస్త ప్రజల బుద్ధి (ధీమతి)ని పవిత్రంగా మలచి పరమసత్యం గ్రహించి, తోటి మనిషి పట్ల సరైన ఆలోచన కలిగే తెలివిని ఇమ్మని ప్రార్థిస్తుంది గాయత్రి మంత్రం.

కఠోపనిషత్తులో, 'రథం'ను ప్రతీకగా తీసుకుని ఇంద్రియాల నియంత్రిణ ద్వారా మానవ బుద్ధి సరైన మార్గంలో ప్రయాణించాలి అన్న భావన కనిపిస్తుంది. సుబుద్ధి వంటి పదాలకు సమానార్థకం 'సన్మతి' పదం. ఆ పదాన్ని ఇక్కడ వాడటంతో పాటకు తాత్వికత లోతు అబ్బింది.

ఓ వైపు నుంచి చూస్తే, 'ఏ పేరుతో పిలిచినా, ఎలా ప్రార్థించినా దైవం ఒక్కటే' అన్న సన్మతిని ఇవ్వమని, మతాల నడుమ అంతరాలు, ద్వేషాలను దాటి సరైన భావనను అవగాహన చేసుకునే తెలివిని ఇమ్మనీ ప్రార్థిస్తున్నట్టు అనిపిస్తుంది. అలాంటి సన్మతి కనుక ఉంటే ఇక ప్రజల నడుమ, ద్వేషాలు, హింస, యుద్ధాలు అన్నీ సమసిపోతాయి. శాంతి నెలకొంటుంది.

సినిమాలో ఇద్దరు హీరోలు సైనికులు. వారిలో నంద పాత్ర భర్త మేజర్. ఇద్దరూ యుద్ధానికి వెళ్తారు. యుద్ధంలో మానవ ప్రాణాలు పోతూంటాయి. ప్రాణం లేని దేహాలు, అనాథల్లా, యుద్ధ రంగంలో పడి వుంటాయి. తమవారిని కోల్పోయిన వారు దుఃఖిస్తూంటారు. ఒకరినొకరు చూసుకుంటూ, మారణహోమం సృష్టించే రాక్షస బుద్ధిని నిర్జించి, ఒకరితో ఒకరు కలిసిమెలసి శాంతియుత జీవనం సాగించే బుద్ధిని, సహనాన్ని కలిగించే 'సన్మతి'ని ఇవ్వమని ప్రార్థిస్తున్నాడు కవి. ప్రస్తుతం ప్రపంచంలో చిన్న చిన్న విషయాలకే కయ్యాలకు కాళ్లు దువ్వటం, యుద్ధానికి దిగటం, తమ స్వార్థం కోసం మొత్తం ప్రపంచాన్ని కష్టపెట్టటానికి సిద్ధపడటం, వంటి విషయాలు చూస్తూంటే లతాతో పాటు గొంతు కలిపి 'సబ్ కో సన్మతి దే భగవాన్' అని ప్రార్థించాల్సి ఉంటుంది.

ఈ పాటను జయదేవ్ 'గౌడ్ సారంగ్' రాగంలో రూపొందించాడు. ఇది శాంతిని, ఏదైనా పొందాలనే తీవ్రమైన తపనను, మానసిక పరిణతిని ధ్వనిస్తుంది. ఇలా అందరికీ సన్మతి కావాలన్న తీవ్రమైన తపన, ఏ పేరుతో పిలిచినా భగవంతుడు ఒక్కడే అనే మానసిక సమతౌల్యత, ఈ భావనలవల్ల కలిగే శాంతినీ ఈ పాట అద్భుతంగా ప్రదర్శిస్తుంది. అందుకే ఈ భజనగీతాన్ని, 'దో ఆంఖే బారా హాథ్' సినిమాలోని భజన గీతం 'ఏయ్ మాలిక్ తెరే బందె హమ్' స్థాయి భజనగీతంగా నిర్ణయించారు నిష్ణాతులు. ఈ రెండు పాటలు వినబడందే ఏ భజన కార్యక్రమం కూడా పూర్తికాదు. అతి క్లిష్టమైన బాణీ ఇది. సరైన రీతిలో పాడితే తపస్సు చేస్తున్న భావన కలిగి మనసు శాంతిమయం అవుతుంది

ఈ పాటను 'జయదేవ్', ఎమ్మెస్ సుబ్బలక్ష్మితో పాడించాలనుకున్నాడు. ఎందుకంటే, దీన్లో క్లిష్టమైన రాగాలు, దీర్ఘాలు, గమకాలు పలు విభిన్నమైన అలంకారాలు ఉన్నాయి. ముఖ్యంగా వక్ర స్వరాలను వాడాడు ఈ పాటలో. దాంతో ఒక స్వరం నుంచి మరో స్వరానికి స్వాభావికంగా కదలదు పాట. మధ్యలో అలంకారాలు వేసి మరీ కలపాలి. సంగీతంలో నిష్ణాతులయిన వారే చేయగలరు ఆ పని. జయదేవ్ అద్భుతమైన పాటను రూపొందించాడనీ, దాన్ని ఎమ్మెస్ సుబ్బలక్ష్మితో పాడించాలనుకుంటున్నాడనీ విన్న లతా మంగేష్కర్, అహం లేకుండా, నిస్సంకోచంగా, నిర్మొహమాటంగా జయదేవ్ దగ్గరకు వెళ్లి పాటను ఒక్కసారి వినిపించమని కోరింది. విన్న పాటను పాడింది. ఒక్కసారి లతా స్వరంలో ఏదైనా పాట విన్న తరవాత అది ఎంతమంది ఎంత గొప్పగా పాడినా నచ్చదు. దాంతో ఒక భజన గీతం కాదు, రెండు భజనల గీతాలనూ లతతో పాడించాడు జయదేవ్.

'అల్లాహ్ తేరో నామ్' పాటలో ఆర్కెస్ట్రాను పరిమితంగా వాడాడు జయదేవ్. సితార్, తాన్పురా, తబలాలను మాత్రమే వాడటంతో, పాటలో పదాలు, పాటను పాడిన విధానాలు ప్రాధాన్యం వహిస్తాయి, దాంతో గేయ రచన గొప్పతనం, గాయని లత స్వర మాయాజలాలను అనుభవించే వీలు కలిగింది. ఇది పాట ప్రభావాన్ని ఇనుమడింప చేస్తుంది.

ఇస్ ధర్తీ కా రూప్ న ఉజ్డే

ప్యార్ కి ఠండీ రూప్ న ఉజ్డే

సబ్ కో మిలే సుఖ్ కా వర్‌దాన్

ఒక్క పాదం ఎంతో అర్థాన్ని తనలో పొదుగుకుని ఉంది. ఈ భూమి అందాన్ని నాశనం కానీయ్యొద్దని ప్రార్థిస్తున్నది. 'భూమి అందం' ఎన్నో రకాలుగా నాశనం అవుతుంది. కాలుష్యం నాశనం చేస్తుంది. మనిషి స్వార్థం కొండలను పిండి కొడుతుంది. అడవులను అపార్ట్‌మెంట్ల అడవిగా మారుస్తుంది. ప్రవాహ మార్గాలు మళ్లించి, బరువైన కట్టడాలు నిర్మించి, భూమి సమతౌల్యాన్ని దెబ్బ తీస్తుంది మానవ స్వార్థం. యుద్ధాలలో బాంబుల ద్వారా భూమినే కాదు మానవ జీవితాన్ని నశింపచేస్తుంది మనిషి అహంకారం. ఎప్పుడైతే ప్రేమ అందించే చల్లని నీడ తగులుతుందో అప్పుడు హింస అదృశ్యమై శాంతి సంభవిస్తుంది. సబ్ కో మిలే సుఖ్ కా వరదాన్... సర్వే జనాః సుఖినోభవంతు. ఈ ప్రపంచం అందించే సౌకర్యాలు అందరికీ సమానంగా అందాలి. ఇదీ కోరిక. ఇది నెరవేరాలంటే 'సబ్ కో సన్మతి' అవసరం. అందుకే ముందు సన్మతిని అభ్యర్థించి తరువాత ఒక్కొక్క కోరిక కోరుతున్నది.

మా బహనోంకి అస్ న టూటే

దేహ్ బినా, దాతా, దేహ్ బినా భట్‌కే నా ప్రాణ్

ఈ చరణం చాలా గొప్పది. తల్లి, సోదరిల ఆశలు దెబ్బ తినకూడదు. యుద్ధం అన్నది మగవాళ్లు ఒకర్నొకరు చంపుకుంటే దాని దుష్పలితాన్ని ఆడవారు అనుభవిస్తారు అంటారు. తండ్రిని, భర్తను, సోదరుడిని కోల్పోయేది స్త్రీలు. వారికి ఆశ్రయం అదృశ్యమైపోతుంది. వారి అండ ఆవిరైపోతుంది. ఆధారం పోయి నిరాధారులవుతారు. జీవితం అల్లకల్లోలమౌతుంది. ఎలాంటి యుద్ధమైనా దాని దుష్ప్రభావం అధికంగా అనుభవించేది మహిళలు, పిల్లలే. యుద్ధంలో సైనికులు మరణిస్తారు. ప్రతి సైనికుడు ఎవరో ఒకరికి భర్త, తండ్రి, సోదరుడో కావచ్చు. సాధారణంగా వ్యక్తి మరణిస్తే అంత్యక్రియలు చేస్తారు. పద్ధతి ప్రకారం శరీరాన్ని వీడిన ఆత్మను గమ్యస్థానం వైపు పంపించే కర్మకాండలు నిర్వహిస్తారు. కానీ యుద్ధ భూమిలో పెద్ద సంఖ్యలో వ్యక్తులు మరణించినప్పుడు ఇది సాధ్యం కాదు. అలాంటప్పుడు ఆత్మలు గమ్యం లేకుండా తిరుగుతుంటాయని నమ్మకం. నశించిన తమ దేహం కోసం, ఆత్మలు వెతుకుతూంటాయి. అవి లేకపోతే గమ్యరహితంగా తిరుగుతూంటాయి. అలాంటి దుస్థితి ఎవ్వరికీ రాకూడదని ప్రార్థిస్తున్నది. మరణంలో వ్యక్తి గౌరవం నిలపమని ప్రార్థిస్తున్నది.

లతామంగేష్కర్ ప్రతి చరణాన్ని ఎంతో విభిన్నంగా గొప్పగా పాడుతుంది. 'మా', బహెన్ అనటంలో 'మా' అని ఒక సెకను ఆగి బహెనోం కా అనటం గొప్ప ఎఫెక్ట్‌నిస్తుంది. 'దేహ్‌బినా' అని ఆగి 'దాతా' అనటంలో అభ్యర్థన తీవ్రతను ప్రదర్శిస్తుంది. 'ముఖ్యంగా చరణాలలో దీర్ఘం తీస్తూ సుదీర్ఘ వ్యాక్యాన్ని ఉపిరి పీల్చకుండా పాడటం శ్వాసపై నియంత్రణను

స్పష్టం చేస్తుంది. అద్భుతమైన గాన సంవిధానం ఒకో పదాన్ని, దాని భావం అనుభవిస్తూ తన స్వరమే భావంగా మలచి వినిపిస్తుంది లతా.

ఓ సారే జగ్ కే రఖ్ వాలే

నిర్బల్ కో బల్ దేనే వాలే

బల్వానోంకో దేదే జ్ఞాన్.

ఓ సారే.. దగ్గర లత వేసిన అలంకారాలు, పాడిన విధానం, 'నిర్బల్ కో బల్ దేనేవాలే' అని రాగయుక్తంగా ఊపిరి బిగబట్టి పాడటం లతను ఎందుకని సంగీత సరస్వతి అంటారో అర్థమవుతుంది అసలు 'ఓసారే' అనటంలోనే భగవంతుడిని అభ్యర్థించటంలో తీవ్రత, అభ్యర్థనలోని ఆరాటం, శ్రోత అనుభవిస్తాడు. 'సాహిర్' పదాల భావాలకు తన స్వరం ద్వారా ప్రాణం పోసి సజీవంగా ప్రకటిస్తుంది లత. ఈ ప్రపంచాన్ని పాలించి రక్షించే వాడిని 'నిర్బలులకు బలం ఇమ్మని, బలవంతులకు జ్ఞానం ఇమ్మనీ' అభ్యర్థిస్తూ 'బల్ వా నోంకో దేదే జ్ఞాన్' అన్నది అద్భుతమైన అభ్యర్థన. బలవంతుడికి జ్ఞానం, విచక్షణ ఉంటే బలహీనుడికి అభద్రతా భావం ఉండదు. అభద్రతా భావం లేకపోతే ప్రపంచంలో ఆయుధాల అవసరం లేదు. యుద్ధాల అవసరంలేదు. కానీ సాధారణంగా బలవంతుడికి అహంకారం ఉంటుంది. అహంకారం విచక్షణను కప్పి వేస్తుంది. బలహీనుడిని వేధించేట్టు చేస్తుంది. దోచుకునేట్టు చేస్తుంది. వేధింపుకు, దోపిడీకి గురయిన బలహీనుడు, గదిలో బంధిస్తే పిల్లి, పులి అయినట్టు ఏదో ఓ రోజు తిరగబడతాడు. హింస చెలరేగుతుంది. తల్లి, సోదరిల ఆశలు దెబ్బతింటాయి. దేహం లేని ఆత్మ సంచరిస్తూంటుంది గమ్యరహితంగా. అందుకే బలహీనుడికి బలం అయిన దేవుడు, బలవంతుడికి జ్ఞానం ఇస్తే ప్రపంచం శాంతిమయం అవుతుంది. అందుకే అందరికీ సన్మతి కావాలి. ప్రస్తుతం మన చుట్టూ సంభవిస్తున్న సంఘటనలను చూస్తూంటే సమస్యలకు మూలం 'సన్మతి' లేకపోవటం అని అర్థమవుతుంది. ఎందుకంటే, ప్రస్తుత పరిస్థితులలో ప్రతివాడూ బలవంతుడే. కానీ 'సన్మతి' అరుదు. అందుకే చిన్న స్థాయి నుంచి పెద్ద స్థాయి వరకూ నేరాలు, ఘోరాలు, మోసాలు, హత్యలు, ఆవేశాలు, రక్తపాతాలు, విధ్వంసాలు, పంతాలు, పట్టుదలలు, అసభ్య ప్రవర్తనలు, దూషణలు, పెద్దా చిన్నా లేకుండా నోటికెంతవస్తే అంత మాట్లాడేయటాలు, మనిషి మనిషిగా కన్నా బొద్దింకలు, క్రిమి కీటకాలుగా ప్రవర్తించేందుకే ఇష్టపడటాలూ, వ్యక్తిస్థాయిలో, కుటుంబ స్థాయిలో సామాజిక స్థాయిలో, దేశ స్థాయిలో అంతర్జాతీయ స్థాయిలో అడుగడుగునా కనిపిస్తున్నాయి. ఇవన్నీ తొలగి ప్రపంచం స్నేహ సౌహార్ద్ర భావాలతో శాంతియుతంగా జీవించాలంటే కావాల్సింది 'సన్మతి'

“సబ్ కో సన్మతి దే భగవాన్”. “బల్వానోంకో దేదే జ్ఞాన్”.

(వచ్చే నెల మరిన్ని పాటలతో)

Click here to share your comments on this story